క్లుప్తంగా

బెస్ట్ అవేలబుల్ సీట్లను భర్తీ చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: బెస్ట్ అవేలబుల్ సీట్లను వెంటనే మంజూరు చేయాలని బీఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘం నాయకుడు రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆసంఘం ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 రోజుల కిందట ఎస్టీ బెస్ట్ అవేలబుల్ సీట్లకు నోటిఫికేషన్ జారీ చేసిందని, పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నాయని విద్యార్థులు చదువులో వెనుకబడే అవకాశం ఉందన్ని వివరించారు. తక్షణం సీట్లు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సురేష్, భీం, బాలరాజు, నరేష్, ప్రభాకర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కొల్లాపూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ రాజయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని నాల్గో వార్డులో హరితహారంలో భాగంగా వారు మొక్కలు నాటారు. మూడో వార్డులో సైడ్‌డ్రైన్ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొల్లాపూర్‌ను హరితపట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ విద్యాసాగర్‌రెడ్డి, కౌన్సిలర్ పసుపుల కృష్ణ, నాయకులు చంద్రశేఖరాచారి, బోరెల్లి మహేష్, కుమార్, మధు ఉన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

బిజినేపల్లి: జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని పాలెంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వైద్య సిబ్బంది అందించారు. నులి పురుగుల కలిగే నష్టాన్ని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పువ్వులు, పండ్ల మొక్కల అందజేత



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరంలో సర్పంచ్ తిరుపాటినాగరాజు ఆధ్వర్యంలో బుధవారం పువ్వులు, పండ్ల మొక్కలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను ఇంటి ఆవరణలో, పొలంలో నాటి సంరక్షించాలని కోరారు. హరితహారంలో భాగంగా మొక్కలను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సాయికృష్ణ, మమత తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్‌గా బస్సు నడపాలి

కొల్లాపూర్ రూరల్: ముక్కిడిగుండం గ్రామానికి రెగ్యులర్‌గా ఆర్టీసీ బస్సు రాకపోకలు కొనసాగించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బుధవారం బస్టాండ్ చౌరస్తాలో గ్రామానికి వచ్చిన బస్సును నిలిపి నిరసన వ్యక్తం చేశారు. ప్రతి రోజు గ్రామానికి బస్సు రాకపోవడంతో విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గ్రామానికి వచ్చే బస్సు సరైన సమయంలో నడిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలపీరు, తదితరులు ఉన్నారు.

వానలు పడాలని ప్రత్యేక పూజలు

పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపూర్‌లో గ్రామస్తులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెరువులో నుంచి బిందెలతో నీళ్లు తీసుకొచ్చి శివలింగానికి జలాభిషేకం చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.



పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కందనూలు: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని స్టీరింగ్ కమిటీ కన్వీనర్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ అన్నారు. బుధవారం బుధవారం జిల్లా కేంద్రంలో యూఎస్పీసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్, కరపత్రాలను డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రామస్వామి, కె.లక్ష్మణ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక ఆర్థిక భద్రత లేని సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉపాధ్యాయ, విద్యారంగ వ్యతిరేక విధానాలపై యూఎస్పీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశలవారీ పోరాటంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల పదోన్నతులు బదిలీలు చేపట్టి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను కొత్త టీఆర్టీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం 23వ తేదీన జాయింట్ ఫోరమ్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సు, వచ్చేనెల 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నా, సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్, ఇందిరా పార్కులో మహాధర్నా నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. అంతకుముందు మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు పి.వహీద్ ఖాన్, జిల్లా కార్యదర్శులు చంద్రశేఖర్, తిరుపతయ్య, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శులు శోభన్ బాబు, తిరుపతయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇంటివద్దే వృద్ధులకు వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

తెలకపల్లి: ఇంటివద్దే వృద్ధులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సంధ్య అన్నారు. బుధవారం మండలంలోని దాసుపల్లి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు సంచార ఆరోగ్య శిబిరం ద్వార వైద్యం అందించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా సెక్రెటరీ రమేశ్‌రెడ్డి, డాక్టర్ సంధ్య మాట్లాడుతూ భారత ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీ సీనియర్ సిటిజన్స్ వైద్యం కోసం తెలంగాణ ప్రభుత్వం సహకారంతో వారి ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మొత్తం 64 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్, సీఎల్ఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రాజ మహేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ శ్రీధర్, కుమార్, కృష్ణారావు, ఏఎన్ఎంలు పుష్ప, శ్రీదేవి, కార్యదర్శి రమేశ్, సంచార వైద్యులు, సిబ్బంది ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

చారకొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకుముందు పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఇక్కడి నుంచి ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను, వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సంస్థాగతంగా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల వారీగా బూత్ స్థాయి కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్ గౌడ్, మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, మాజీ జెడ్పీటీసీ భీముడు, నాయకులు అంజయ్య, నర్సింహ రెడ్డి, కొండల్ రావు, యూత్ ప్రెసిడెంట్ గణేష్ ఉన్నారు.

జెడ్పీ కార్యాలయం ఎదుట స్వీపర్ల ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న స్వీపర్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్వీపర్లు స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 160 మంది స్కూల్ స్వీపర్లు పని చేస్తున్నారని కేవలం రూ.1623 ల వేతన మాత్రమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసరాల ధరలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా ప్రభుత్వం స్వీపర్లకు రూ.27వేల వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి గౌడ్, జిల్లా కార్యదర్శి వెంకటయ్య గౌడ్, కోశాధికారి నర్సింహా, స్వీపర్లు బాలస్వామి, సలీం, రామేశ్వరమ్మ, పద్మ, నిరంజన్, పుల్లయ్య,, జయమ్మ, నారాయణ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయంతో అవస్థలు



విద్యుత్ తీగలను సరి చేస్తున్న సిబ్బంది

మన్ననూర్: మూడు రోజులుగా ముసురు కురుస్తుండటంతో వటువర్లపల్లి, సార్లపల్లి, కుడిచింతల బైలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం సర్పంచ్ చత్రు నాయక్, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది శేఖర్‌గౌడ్, తిరుమల్ సహకారంతో అటవీ మార్గం గుండ వెళ్తూ సమస్య ఎక్కడ ఉందో గుర్తించారు. రెండు చోట్ల విద్యుత్ తీగలను సరి చేశారు. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన నాసిరక కేబుల్ సహాయంతోనే ఇప్పటికీ విద్యుత్ సరఫరా చేస్తున్నారని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన కేబుల్ స్థానంలో 11 కేవీగా క్రమబద్ధీకరించాలని అధికారులను కోరారు. చెట్ల కొమ్మలు తగిలి కేబుల్ కాలిపోతుండటంతో తరుచు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వాపోయారు. కొత్తగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హెచ్‌ఎంలను తొలగించాలని ఆర్‌జేడీకి వినతి

కందనూలు: తిమ్మాజీపేట్ మండలం చేగుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్, లొట్లోని తండా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డిలను వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంతోష్ రాథోడ్, గిరిజన సంఘం కార్యదర్శి అశోక్ , సెక్రెటరీ నల్లవెల్లి భరత్, బంజారా గిరిజన సమాఖ్య రాష్ట్ర ఇన్‌చార్జ్ శ్రావణ్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ (ఆర్‌జేడీ) కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేశారు. హెచ్‌ఎం పరమేశ్వర్ పాఠశాలలో విద్యార్థులను, ఉపాధ్యాయులను మానసికంగా వేధిస్తున్నాడని వివరించారు. హెచ్‌ఎం సాయిరెడ్డి పాఠశాల నిధులను కాజేశారని తెలిపారు. విచారణ కమిటీ ఈ విషయం రుజువైందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



తాడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కల్వకుర్తిలో..

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. కొనసాగింది. కల్వకుర్తిలో భిక్షాటన చేశారు. అచ్చంపేటలో ప్రతిపక్ష పార్టీలు, పలు సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి సంఘీభావం తెలిపారు. కోడేరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తాడూరులో ర్యాలీ నిర్వహించారు. వెల్దండలో జేఏసీ నాయకులు మద్దతు ప్రకటించారు. తెలకపల్లిలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. –సాక్షి, నెట్‌వర్క్

23న స్వయం ఉపాధిపై శిక్షణ

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో 23న ప్రగతి నారీ శక్తి ఆధ్వర్యంలో మహిళలకు శిక్షణా శిబిరం నిర్వహిస్తునట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు కొల్లూరి దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి పథకాలు, నైపుణ్యం పెంపుదలపై అవగాహన కల్పిస్తామని వివరించారు. వివిధ గ్రామాల నుంచి జిల్లా వ్యాప్తంగా మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

రేషన్ కోటాలో తరుగు

వెల్దండ: మండలంలోని కొట్ర, తిమ్మినోనిపల్లి గ్రామాల రేషన్‌దుకాణాలకు కల్వకుర్తి స్టాక్ పాయింట్ నుంచి బుధవారం లారీలో బియ్యం సరఫరా చేశారు. కొట్ర రేషన్ దుకాణానికి సరిపడ బియ్యం బస్తాలకు మూడు సంచుల బియ్యం తక్కువగా వచ్చాయి. ఈ విషయాన్ని రేషన్ డీలర్ స్టాక్ పాయింట్ సివిల్ సప్లయి ఇన్‌చార్జ్ రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారులు స్పందించి షాపులకు అందించే రేషన్ బియ్యం సక్రమంగా అందేవిధంగా చూడాలని డీలర్లు కోరారు.

డీఎస్పీకి సన్మానం



కల్వకుర్తి: డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శంకరయ్యను బుధవారం మండల కేంద్రంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సైదులుగౌడ్, విద్యార్థి సంఘం నాయకులు ఆనంద్‌గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు రవిగౌడ్, నాగరాజు గౌడ్ తదితరులు డీఎస్పీకి పూలబొకె ఇచ్చి శాలువాతో సన్మానించారు.

కల్వకుర్తి రూరల్: నూతన సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులును జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ ఆధ్వర్యంలో సీఐని శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, రుక్కయ్య యాదవ్, గంగాధర్, అంజయ్య గౌడ్, చక్రం తదితరులు ఉన్నారు.

క్రమబద్ధీకరణ స్థలాల పరిశీలన

వెల్దండ: మండలంలోని పోతేపల్లి, చెర్కూర్, వెల్దండ గ్రామాల్లో బుధవారం అధికారులు క్రమబద్ధీకరణ చేసే స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాల్లో 2014 నుంచి 2020 వరకు ఇంటి నిర్మాణాలు చేపట్టిన వారి స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారుల సర్టిఫికెట్లను పరిశీలించి పూర్తి వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏడీ నాగేష్, డీటీ శ్రీను, ఆర్ఐ శంకర్‌నాయక్ ఉన్నారు.

ప్రతిభా పురస్కారాల అందజేత

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభా నగదు పురస్కారాలను బుధవారం కళాశాలలో బృందం సభ్యులు అందజేశారు. కళాశాల ప్రాంగణంలో నలుగురు విద్యార్థులకు రూ.10వేల సాయం అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ రెడ్డి, మిత్ర ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

వంగూరు: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ అన్నారు. బుధవారం మండలంలోని చౌదర్‌పల్లిలో పాఠశాల అదనపు గదుల నిర్మాణం కోసం రూ.12లక్షల నిధులను ఆయన కేటాయించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పాఠశాల అభివృద్ధి కోసం నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. విద్యారంగం బలోపేతం కోసం మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు భీమమ్మ లాలూయాదవ్, కోఆప్షన్ సభ్యులు హమీద్, మార్కెట్ వైస్ చైర్మన్ మంద రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గణేష్‌రావు, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరపిలేని ముసురు



బల్మూర్: రెండు రోజుల నుంచి ముసురు వర్షం కురుస్తోంది. మేఘాలు పూర్తిగా కమ్ముకున్నాయి. మండలంలోని వీరంరాజ్‌పల్లి గ్రామానికి కొండనాగు, బల్మూర్, రామాజిపల్లి, అచ్చంపేట ఆర్అండ్‌బీ రోడ్ల నుంచి నాలుగు వైపుల ఉన్న మట్టి రోడ్లు బురదమయంగా మారాయి. వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. రైతులు పంట పొలాల్లో బిజీబిజీ గడిపారు. కొన్నచోట్ల వరినాట్లు వేశారు. వృద్ధులు, చిన్నారులు ఇంటికే పరిమితం అయ్యారు. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాలేదు. రెయిన్‌కోట్లు ధరించి పనులకు వెళ్లారు. వర్షా కాలం వచ్చిందంటే బాధలు తప్పడం లేదని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్లకు అన్యాయం చేయొద్దు

కల్వకుర్తి: గెస్ట్ లెక్చరర్లుగా ప్రభుత్వ కళాశాలల్లో 10 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న గెస్టు లెక్చరర్లకు అన్యాయం చేయొద్దని ఆ సంఘం రాష్ట్ర నాయకులు సదానందంగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పదేళ్ల నుంచి పనిచేస్తున్న 1654 మంది గెస్ట్ లెక్చరర్లను తొలగించడం ఎంతవరకు సబబు అన్నారు. విద్యాశాఖ మంత్రి సూచన మేరకు పాతవారికి రెన్యూవల్ చేయాలని కోరారు.

ఆర్డీఓకు సన్మానం

అచ్చంపేట రూరల్: రెవెన్యూ డివిజన్ ఆఫీసర్‌గా గోపిరాం బుధవారం విధుల్లో చేరారు. గతంలో నల్లగొండ జిల్లా దేవరకొండ ఆర్డీఓగా ఆయన విధులు నిర్వర్తించారు. సాధారణ బదిలీలో భాగంగా మండలానికి బదిలీ అయ్యారు. ఆర్డీఓకు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కరిస్తానని ఆర్డీఓ పేర్కొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



కోడేరులో ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏల్లేని సుధాకర్‌రావు

తాడూరు: బీజేపీతోనే ప్రగతి సాధ్యమని రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండమణెమ్మ అన్నారు. బుధవారం మండలంలోని ఆకునెల్లికుదురు, చర్లికాల గ్రామాల్లో బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. ప్రధాని నరేంద్ర మోడీ ద్వారానే దేశ రక్షణ, భద్రత ఉంటుందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై సీఎం కేసీఆర్ కేసులు పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొండనాగేష్, మండల నాయకులు లోహిత్‌రెడ్డి, ఆంజనేయులు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని అమరగిరిలో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణ ఆధ్వర్యంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గడప గడపకు బీజేపీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన నిధులను వివరించారు. కార్యక్రమంలో మూలె వెంకటేష్, ఎండీ ఖలీల్, కంటె వెంకటస్వామి, విష్ణు, శ్రీహరి, రవి, చందు తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: ఎమ్మెల్యేగా ఒక అవకాశం కల్పిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏల్లేని సుధాకర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని మైలారం, నర్సాయిపల్లి, తదితర గ్రామాల్లో గడప గడపకు కమలం గుండె కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మనెమోని పుల్లయ్య, బాలపీరు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే లక్ష్య సాధన



కందనూలు: నైపుణ్యంతోనే లక్ష్యాన్ని చేరుకోవచ్చని మాస్టర్స్ ట్రెనింగ్ అకాడమీ డైరెక్టర్స్ వీవీ రామకృష్ణ శాస్త్రి, సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లైఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీవీ రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ లక్ష్యసాధనకు పేదరికం అడ్డు రాదన్నారు. సాంప్రదాయాలను పాటిస్తూ ఆదర్శంగా నిలవాలని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కొత్త ఆలోచనలతో జీవితంలో ఎదిగి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ అనసూయ, ఎన్ఎస్ఎస్ యూనిట్- 1 ప్రోగ్రాం ఆఫీసర్ కే వెంకటేశ్వరరావు, లెక్చరర్లు కె లక్ష్మి, వై లింగయ్య, ఇక్బాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి



వెల్దండ: కళాశాల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి ఉమేష్ కోరారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏబీవీపీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.5300 కోట్లు నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. వసతి గృహాల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఆగష్టు 1వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మహ ఉద్యమ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చరణ్, నవీన్, భిక్షపతి, తదితరులు ఉన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సున్నపుతండా, బోడబండ తండాల్లో బుధవారం ఏకకాలంలో కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ చెందిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ప్రతి ఇంటిలో సోదాలు నిర్వహించారు. 20 లీటర్ల నాటు సారా, 120 కేజీల నల్లబెల్లం, 600 లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వేడుకోలు

కొల్లాపూర్ రూరల్: భూమికి పట్టా ఉన్నా అధికారులు పంటలకు వేయకుండా అడ్డుకుంటున్నారని రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి వెంకటస్వామి ఆరోపించారు. మండలంలోని సోమశిల గ్రామానికి చెందిన వెంకటస్వామి భార్య పేరుపై 2001లో అప్పటి ప్రభుత్వం చెన్నంపల్లి శివారులో సర్వే నెం. 87లో 5 ఎకరాలు భూమి ప్రభుత్వం ఇచ్చారు. పట్టా కూడా అందజేశారని వివరించారు. ఫారెస్ట్ అధికారులు పంటలు వేయకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన వేడుకుంటున్నాడు.

ఫొటో, వీడియో కెమెరాలపై అవగాహన

కల్వకుర్తిరూరల్: ఫొటో, వీడియో గ్రాఫర్లు మార్కెట్‌లోకి వస్తున్న నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు రవికుమార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఫొటో, వీడియో గ్రాఫర్లకు కెనాన్ కంపెనీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో రాంబాబు, అభిమన్యు, విష్ణులు కెమెరాల పనితీరును సభ్యులకు వివరించారు. ఫొటోగ్రాఫర్స్ జిల్లా అధ్యక్షుడు నేతాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకట్, అనిల్ గౌడ్, సాధిక్, మొయిన్‌ఖాన్, అనిల్‌గౌడ్, నందు, వంశీ, రియాజ్, రాఘవేందర్, నారాయణగౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

